క్లుప్తంగా

సుబ్బారాయుడికి రూ.8.9 లక్షల ఆదాయం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా స్వామివారికి రూ. 8,90,333 ఆదాయంతో పాటు 580 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య తెలిపారు. ఈ కానుకలు 63 రోజుల్లో భక్తులు సమర్పించినట్లు చెప్పారు. గుడివాడ డివిజన్ ఎండోమెంట్స్ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

బిడ్డల ఎదుగుదలపై శ్రద్ధ చూపండి



గుడివాడ టౌన్: బాల్యం నుంచే బిడ్డల ఎదుగుదలపై తల్లులు శ్రద్ధ చూపాలని గుడివాడ ఐసీడీఎస్ సీడీపీఓ విజయ ఫ్లారెన్స్ అన్నారు. గురువారం స్లేవెంజర్స్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బిడ్డల ఎదుగుదల అనే అంశంపై తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 6 సంవత్సరాల లోపు పిల్లల ఎత్తు బరువు కొలిచి వారి ఆరోగ్య పరిస్థితిని అంచనావేసి వారికి కావలసిన కాంప్లిమెంటరీ, బాలామృతం అందజేశారు. గర్భిణులు ప్రసవ సమయంలో, ప్రసవానంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు.

17న శివాలయం పునఃప్రతిష్ట



తోట్లవల్లూరు: రొయ్యూరులోని గంగాపార్వతీ సమేత శ్రీసకలేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్టా మహోత్సవం ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. గతంలో ఉన్న ఆలయం శిథిలదశకు చేరటంతో దానిని తొలగించారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సహకారంతో పాత ఆలయం స్థానంలో నూతన ఆలయ పునర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 75 లక్షలు మంజూరు చేసింది. అలాగే గ్రామస్తులు కూడా మరికొన్ని నిధులు స్వచ్ఛందంగా సమీకరించుకుని ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అన్ని పనులు పూర్తి కావటంతో ఈ నెల 17న బ్రహ్మశ్రీ చదలవాడ ఈశ్వరచందు ఆధ్వర్యంలో ఉదయం 10.27 గంటలకు శివలింగం, పార్వతీదేవి, గణపతి, వీరభద్రస్వామి, నందీశ్వరుడు, ద్వారపాలకులు, నవగ్రహాలు, జీవధ్వజం, ఆలయ శిఖరాలు, బలిపీఠం, నాగబంధ విగ్రహ పునఃప్రతిష్ట నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పమిడిముక్కల: మండలంలోని అలీనగీపాలెం గ్రామంలో టీడీపీ, జనసేనకు భారీ షాక్ తగిలింది. సీసీ రోడ్డు ప్రారంభానికి బుధవారం రాత్రి ఎమ్మెల్యే గ్రామంలోకి వెళ్లారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సమక్షంలో పెద్ద సంఖ్యలో టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ పటిష్టతకు పాటుపడాలని సూచించారు. జగనన్న సంక్షేమ పాలన చూసి పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సజ్జాద్‌అలీ, కోఆప్షన్ సభ్యుడు దియానత్ అలీ, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

జమీగొల్వేపల్లి(పామర్రు): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలను అందించాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని జమీగొల్వేపల్లి పీహెచ్‌సీని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను రిజిస్టర్లను ఆయన తనిఖీలు చేశారు. అనంతరం మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష 1, 2 కార్యక్రమాల ద్వారా పీహెచ్‌సీ పరిధిలో గుర్తించిన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సకాలంలో వైద్యసేవలను అందించి వారికి మందులను అందించాలన్నారు. గ్రామ సర్పంచ్ రాయవరపు శాంతకుమారి, వైద్యుడు వర ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.2 లక్షల చెక్కు అందజేత

మండవల్లి: గత నవంబర్‌లో తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతు బొయిన జయరాజు భార్య బి. పేరంటాలుకు లింగాల సప్తగిరి బ్యాంక్ మేనేజర్ గురువారం రూ.2 లక్షల చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఓబీసీ రాష్ట్ర నాయకుడు లావేటి వీర శివాజీ మాట్లాడుతూ పీఎం జీవనజ్యోతి సురక్ష యోజన ఇన్సూరెన్స్ ద్వారా పలు ప్రయోజనాలు చేకూరుతాయన్నారు.

అంబేడ్కర్ ఆశయాలే దిక్సూచి

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని, చైర్మన్ విక్టర్ ప్రసాద్

గుడివాడ టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా, ఆయన సూచనలే దిక్సూచిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. గురువారం స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించాల్సి వచ్చిందన్నారు. ఆ విగ్రహానికి ప్రతిగా నెహ్రూచౌక్ సెంటర్‌లో నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. విగ్రహ ఏర్పాటు కమిటీ ఆమోదిస్తే కాంస్య విగ్రహాన్ని తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తామన్నారు. రాజ్యాంగ నిర్మాతను గౌరవిస్తూ వైఎస్సార్ ప్రభుత్వం విజయవాడ నడిబొడ్డులో రూ. 900 కోట్లు విలువగల స్థలంలో రూ. 450 కోట్లతో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేయడంతో పాటు టూరిజం పరంగా అభివృద్ధి చెందేందుకు అక్కడ అనేక ప్రత్యేకతలను ఏర్పాటు చేసిందన్నారు.

సొంత నిధులివ్వడం అభినందనీయం..

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా గుడివాడ దళిత సంఘాల నాయకులు గుడివాడ ప్రధాన కూడలి అయిన నెహ్రూచౌక్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చెయ్యాలని కలలు కంటున్న నేపథ్యంలో కొడాలి నాని సొంత నిధులతో అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కొడాలి నాని రాజకీయాలు ప్రారంభించిన నాటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పక్షపాతిగా కొనసాగడంతో పాటు వారి అవసరతలు తీర్చి పేదల నాయకునిగా కొనసాగుతున్నారన్నారు. ఇంతటి గొప్ప కార్యాన్ని నిర్వహిస్తున్న కొడాలి నానికి దళిత సంఘాల ఐక్యవేదిక కృతజ్ఞతలు తెలుపుతుందన్నారు. దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు పొంగులేటి జయరాజు, కారెం జోసఫ్, మెండా కిరణ్‌కుమార్, బెజ్జం సువర్ణరాజు, కాకొల్లు రాజారెడ్డి, బొద్దు విల్సన్, దోనె కోటిబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పమిడిముక్కల: ఐనపూరు హైస్కూల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులు 30 మందికి దాత దొడ్డా పూర్ణచంద్రరావు రైటింగ్ ప్యాడ్, పెన్ను, పెన్సిల్, స్కేల్ అందజేశారు. హైస్కూల్‌కు 10 వైట్ పేపర్స్ బండిల్స్ విరాళంగా అందజేశారు. బాగా చదువుకొని గ్రామానికి మంచి పేరు తేవాలని పూర్ణచంద్రరావు విద్యార్థులకు సూచించారు. హైస్కూల్ అభివృద్ధికి సహకరిస్తున్న దాత పూర్ణచంద్రరావుకు హెచ్‌ఎం ఎస్‌వీకే స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

పాడి రైతులకు ఉచిత వైద్య పరీక్షలు



పామర్రు: విజయవాడ కృష్ణామిల్క్ యూనియన్, వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో పాడి రైతులకు ఉచితంగా యాంజియోగ్రామ్ చేయించామని యూనియన్ జిల్లా అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు అన్నారు. స్థానిక పాల శీతల కేంద్రంలో క్లస్టర్ పరిధిలోని వేములమడ, ధూళిపూడిపాలెం సొసైటీల్లో గుండెకు సంబంధించిన సమస్యలు ఉన్న పాడి రైతులను గుర్తించి వారిని విజయవాడ తీసుకువెళ్లి ఉచితంగా పరీక్షలు చేయించి అనంతరం యాంజియోగ్రామ్ చేయించామన్నారు. వీరిలో ఒకరికి హార్టు సర్జరీ చేయాల్సి వస్తుందని వైద్యులు తెలిపారని త్వరలో చేయిస్తామని వివరించారు. కార్యక్రమంలో పామర్రు పాలశీతల కేంద్రం మేనేజర్ గోపీనాథ్, రూట్ సూపర్‌వైజర్ కైల రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి ఆశీస్సులు అందరికీ ఉండాలి

వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే కొడాలి నాని



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ రూరల్: వీరబ్రహ్మేంద్రస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆకాంక్షించారు. మండల కేంద్రమైన నందివాడలో వేంచేసియున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవంలో గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొడాలి నాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాదిమంది భక్తుల మధ్య ఎంతో వైభవంగా జరుగుతున్న స్వామివారి వార్షిక కల్యాణ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఆలయ భక్తబృందం సభ్యుడు దేశిరెడ్డి రామ్మోహన రెడ్డి దంపతులు పీటల మీద కూర్చొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలను వేద పండితులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల ఆదాం, వైఎస్సార్ సీపీ తోట నాగరాజు, నరేళ్ల నాగేశ్వరరావు, రాజులపాటి చంద్రయ్య, బండి కోటి, పీఏసీఎస్ అధ్యక్షుడు కొండపల్లి రంగారెడ్డి, ఆలయ భక్తబృందం సభ్యులు దేశిరెడ్డి రాంబ్రహ్మారెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు గుణపాఠం చెప్పాలి



పెదగొన్నూరులో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనింపజేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నపై స్వార్థ రాజకీయాల కోసం ఏకమైన ప్రతిపక్షాలకు ప్రజలు తగిన రీతిలో గుణపాఠం చెప్పాలని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని పెదగొన్నూరులో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తూ ముఖ్యమంత్రి జగనన్న ప్రజల్లో అభిమానాన్ని పొందుతున్నారన్నారు. ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం ద్వారా సాయమందిస్తూ ఆదుకుంటున్న ముఖ్యమంత్రిని ప్రతిపక్ష నేతలు విమర్శించడం దారుణమన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా తిరిగి పోటీ చేస్తున్న తనతో పాటు ఏలూరు ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు విజయాన్ని చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, చొప్పర్ల సునీత, సర్పంచ్ తాడంకి శిరీష, సొసైటీ అధ్యక్షుడు శ్రవణం పూర్ణచంద్రరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు జగనన్నకే సాధ్యం



వాడవల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దూలం స్వాతి, నాయకులు

ముదినేపల్లి రూరల్: పేదలకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడం ముఖ్యమంత్రి జగనన్నకే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండలంలోని వాడవల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్ తరఫున గురువారం వారు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయాన్ని సాధించి జగనన్న తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామంలో స్వాతి, పార్టీ నాయకులకు మహిళలు, వృద్ధులు ఘనంగా స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి

కైకలూరు: ఎన్నికల సమయంలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు చెప్పారు. కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్‌లో టౌన్, రూరల్ పోలీసు సిబ్బందితో ఎన్నికల నిర్వహణపై గురువారం సమీక్ష నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత ఎన్నికల నిర్వహణలో పోలీసు సిబ్బంది కీలకంగా వ్యవహరించాలన్నారు. ఆయా గ్రామాల్లో ఘర్షణలు జరిగే సమాచారాన్ని ముందుగానే పోలీసులు సేకరించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా జరిగే మద్యం సరఫరా, నగదు పంపిణీపై జాగ్రత్తగా ఉండాలన్నారు. రహదారులపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణ సీఐ ఆకుల రఘుతో కలసి ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ నిమిత్తం సంఘటన స్థలానికి వెళ్లారు. కార్యక్రమంలో రూరల్, టౌన్ ఎస్ఐలు టి.రామకృష్ణ, ఎంఆర్‌కే రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి సీఎం సాయం



బాలుడి తండ్రికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: అత్యవసర పరిస్థితుల్లో బాలుడికి వైద్యం అందించడానికి చేసిన వ్యయానికి సంబంధించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని పెనుమల్లికి చెందిన కాగిత బుజ్జి కుమారుడు హేమేష్ అనారోగ్యానికి గురవ్వడంతో వైద్యం చేయించారు. ఇందుకు చాలా వ్యయం కాగా విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)కు తెలిపారు. దీంతో ఆయన ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించగా రూ.5 లక్షలు నిధులు మంజూరు చేస్తూ చెక్కును పంపారు. దీనిని పెదగొన్నూరు శివారు ఉప్పరగూడెంలో బాలుడి తండ్రి కాగిత బుజ్జికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా బాలుడి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే డీఎన్నార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రహదారి పనులకు శ్రీకారం

ముదినేపల్లి రూరల్: మండలంలోని దాకరం నుంచి పేరూరు వెళ్లే పంచాయతీ రాజ్ రహదారి పనులకు గురువారం శ్రీకారం చుట్టా రు. ఈ రోడ్డు దెబ్బతిన్న విషయాన్ని సొసైటీ అధ్యక్షుడు సోమా సత్యనారాయణ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) దృష్టికి తీసుకువెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించి పనులను సొసైటీ అధ్యక్షుడు పూజా కార్యక్రమాలు నిర్వహించి గురువారం ప్రారంభించారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు సొసైటీ అధ్యక్షుడితో పాటు పేరూరు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారులకు సత్కారం

గుడివాడ టౌన్: సౌత్ ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో గుడివాడ క్రీడాకారులు స్వర్ణపతకాలు సాధించడం అభినందనీయం అని ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎం. శివరామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఇటీవల పలు ప్రాంతాల్లో క్రీడాపోటీలలో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కర్ణాటక ఉడిపిలో జరిగిన సౌత్ ఇండియా అథ్లెటిక్స్ మీట్‌లో పట్టణానికి చెందిన సీహెచ్ అప్పలస్వామి 400, 800 మీటర్లు పరుగు పోటీల్లో బంగారు పతకాలు, కేవీ నాగులు 400, 200, 100 మీటర్ల పరుగు పోటీలో బంగారు పతకాలు, వి. సుధాకర్ 4''100 రిలే పోటీల్లో మూడో స్థానం సాధించారన్నారు. అలాగే ఇటీవల విజయనగరంలో జరిగిన మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన ఎన్టీఆర్ స్టేడియం మాస్టర్ కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. క్లబ్ కార్యదర్శి కోనా రామారావు, కోశాధికారి సీహెచ్ రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

క్రైస్తవుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

పామర్రు: క్రైస్తవుల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీ అధ్యాపకుడు ఎ. మోజెస్ అన్నారు. స్థానిక చాట్లవానిపురంలోని విజన్‌లైఫ్ సెంటర్‌లో ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ సభ్యుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల మాట్లాడుతూ క్రైస్తవులను ప్రత్యేక శ్మశాన వాటికల ఏర్పాటుకు స్థలాలను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘ సభ్యులు టి. షాలెంరాజు, వై. సంగీతరావు, ఎం. శామ్యూల్, సాల్మన్ రాజు గెడ్డాడ, ఎం. మోషే పాల్గొన్నారు.

నాలుగో రోజుకు పెద్దింట్లమ్మ జాతర

కైకలూరు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర గురువారానికి నాలుగో రోజుకు చేరింది. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, తృతీయావరణ పూజ, కలశార్చన, పుష్పాలంకరణ, ధూపసేవ బాలభోగము, హారతి, మంత్రపుష్పం, సాయంత్రం పంచహారతి నిర్వహించారు. అమ్మవార్లకు వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదానికి భుజబలపట్నంకు చెందిన అల్లూరి జ్ఞానేంద్రవర్మ, అల్లూరి సురేశ్ రాజు దంపతులు దాతలుగా వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కామినేని కల్లబొల్లి కబుర్లు నమ్మవద్దు

ఎమ్మెల్యే డీఎన్నార్



గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమంలో ప్రజలతో ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: కామినేని శ్రీనివాస్ కల్లబొల్లి మాటలతో కైకలూరు నియోజకవర్గ ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని.. ఆ మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకోడానికి గుడ్ మార్నింగ్ కైకలూరు పేరుతో ఎమ్మెల్యే డీఎన్నార్ నిర్వహిస్తున్న కార్యక్రమం గురువారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. 5వ వా ర్డులో ఇంటింటికీ తిరుగుతూ ఆయన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు నీరాజనాలు పట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ మంత్రి కామినేని ప్రచారంలో సీఎం జగన్ అరాచకపాలన సాగిస్తున్నారని పదేపదే చెబుతున్నారని, అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆయన అలా మాట్లాడుతున్నారన్నారు. కామినేని పాలనలో రూ.600 కోట్లు అభివృద్ధి అని చెబుతున్నారని నియోజకవర్గంలో అది ఎక్కడో చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన కోట్లాది రూపాయల పనులను తాను చూపిస్తానన్నారు. రా నున్న ఎన్నికల్లో ప్రజలు తనను, ఎంపీ అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపించాలని డీఎన్నార్ కోరారు. ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, జిల్లా ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ నాయకులు షేక్ రఫీ, జాన్ విక్టర్, కూనవరపు సతీష్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, నాయకులు మోహనరావు, కొండరాజు, కాసులు, ఎం. గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీపీ గద్దే పుష్పరాణి



చేయూత చెక్కును అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు

గుడివాడరూరల్: మహిళా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాలుగో విడత చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు. మహిళలు సమాజంలో ఆర్థికంగా ఎదిగితే వారి కుటుంబ పరిస్థితులు మారి ఉన్నత స్థాయికి వచ్చే అవకాశం ఉందన్నారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతే ధ్యేయంగా సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు జగన్‌మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువచ్చి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. అనంతరం 2,938 మంది లబ్ధిదారులకు రూ.5.52కోట్లు చేయూత నమూనా చెక్కును అందజేశారు. ఎంపీడీవో కె.జ్యోతి, వైస్ ఎంపీపీ భట్టు నాగమల్లేశ్వరి, జిల్లా సమైక్య అధ్యక్షురాలు తోట నాగమునిమ్మ, వెలుగు ఏపీఎం సాంబశివరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు



కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలను పంపిణీ చేశామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. కైకలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద 3వ సచివాలయం పరిధిలో 52 మంది మహిళలకు ఇంటి పట్టాలు, రిజిస్ట్రేషన్ పత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోనే ఇంటి పట్టాల పంపిణీలో కైకలూరు నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఒక్క కైకలూరు వైఎస్సార్ గ్రీన్ విలేజ్‌లోనే 4,033మందికి ఇప్పటికీ పట్టాలు ఇచ్చామన్నారు. మ రింత మందికి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, ఏలూరు జిల్లా ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ రఫీ, ముస్లిం మైనారిటీ యువ నాయకులు అసాని ఖాన్, ఫిర్దోస్ ఖాన్ పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం



హనుమంతపురంలో పేదలకు రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరరావు, రాంబాబు, మహేష్

పమిడిముక్కల: పేదల సొంతింటి కల సాకారం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని హనుమంతపురం గ్రామంలో 87 మంది లబ్ధిదారులకు గురువారం రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, సర్పంచ్ కలపాల రాంబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా ఇళ్ల స్థలాల పంపిణీ

మండవల్లి: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ముమ్మరంగా జగనన్న ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండవల్లి సచివాలయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ, సొసైటీ అధ్యక్షుడు గుడిడా బాబి, ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ పాల్గొన్నారు. భైరవపట్నం సచివాలయంలో 185 ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. సర్పంచ్ నీలపాల రాధా నాగేంద్రరావు, ఎంపీటీసీ కిరీటి రాజు, కార్యదర్శి కె. ప్రభాకరరావు, వీఆర్వో ఆంజనేయులు పాల్గొన్నారు. లింగాల గ్రామ సచివాలయంలో 63 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ కమదన నాయనబాబు, ఆలయ చైర్మన్ ఆర్ యశోదరావు తదితరులు పాల్గొన్నారు.